# గుడ్డిప్రేమ

రమాపతి గురించి విన్నానుగానీ, అతన్ని ఇదివరకు చూచినట్లు గుర్తులేదు. తొలిసారి కలుసుకున్నప్పుడు మాట పెగలకపోతే –

"నేనురా.....నీ మేనమామని" అన్నాడు చిన్నవ్వుతో. అతని మధ్యపాపిడితోవున్న జుత్తు, ఆ నవ్వు, ఆ మీసాలూ, ఆ అజానుబాహు విగ్రహం, అసలు అతనే నా మనసు దోచుకున్నాడు. వీపు తట్టుతూ–

"చెప్పు చూదాం? వీశెడు ఇనుము బరువా, వీశెడు దూది బరువా?"

దానికి జవాబు నాకిదివరకే తెలుసు కాబట్టి తొణక్కుండా కరెక్టుగా చెప్పగానే......

"వీడు పదేళ్ళవాడుకాదు బావా! విగ్రహం పుష్టిగానూ వుంది. బుద్ధికూడా పలక బారింది" అన్నాడు.

పదేళ్ళవయసులో పల్లెటూరునించి పట్నంలో పడ్డానేమో కొద్ది రోజులు అంతా వింతగా వుండేది..... ఒకనాడు రమాపతి –

"నువ్వెందుకు యిక్కడికొచ్చేవో తెలుసా?" అన్నాడు.

"చదువుకోడానికి."

"భేష్!" అంటూండగా మా అత్తయ్య –

"అలాగే మీరు బేష్ అనండి– వాడు బట్టలు వుతకడం మానేస్తాడు" అంటూ నూతిదగ్గర బండెడు బట్టలు వేసింది.

ఇంకోసారి డాక్టరు రమాపతి మామయ్య మందిస్తూ "అసలు కొంపకు మందులేదురా. మిరియాల కషాయం బెస్ట్. మీ అత్తయ్యచేత చేయించగలవా?" అన్నాడు.

పెదవి విరిచాను.

"సరే, చేపల్లో నీకిష్టమైన చేప పేరు చెప్పు."

"రొయ్యలు."

"మీ అత్తయ్య కన్నవారింటికి వెళ్ళనీ. నా వంటకీ అత్తయ్య వంటకీ తేడా చూస్తావు. ఈ ఆశే నీకు మందు. రొంపపోతుంది ఫో" అన్నాడు.

వర్షాకాలం వచ్చినా అత్తయ్య కన్నవారింటికి వెళ్ళలేదు. ఈ మూడు నెలల్లో బజారు చేయడం నేర్చుకున్నానుగానీ అప్పుడప్పుడు కొసరు అడగటం మరచిపోతున్నాను. అత్తయ్య కొసరు అడిగి తీసుకురాటానికి బజారుకు తిరిగి పంపేది.

వీధి అరుగుమీద రోగులకోసం కాసుకు కూర్చున్న డాక్టరు "మళ్ళీ బజారుకేనా?" అన్నాడు.

"కొసరు తేవటం మరచిపోయాను."

"మీ అత్తకి గుడ్డిగా బతకడం తెలీదు – గుడ్డిగా ప్రేమించడం తెలీదు."

పెళ్ళాంకూడా రోగులు రాలేదన్న దిగులుతో వెంట అంటిపెట్టుకుండేదేమో?

"కళ్ళండి యింత బతుకు బలికేస్తున్నాను. గుడ్డిదైతే ఇంటి ఎదర కుళ్లు కాలువలో తోసేద్దురు" అంది.

డాక్టరు మామయ్య నాలిక కరుచుకున్నాడు. ఆ రోజుల్లో బాగా గుర్తుకున్నాది– ఒకనాటి రాత్రి వర్షం, మేం వున్నది విశాఖపట్నంలో, వూరి కాలవలన్నీ వురకలు వేస్తూ చేరుకునే వుప్పుటేరు వారలోనున్న వెలమపేట. వర్షం వస్తే అటు వుప్పుటేరు దాడి చేస్తూంది. ఇటు కాలువలూ పొంగి యింటినే కుళ్ళకాలువగా మారుస్తాయి. ఆనాటి రాత్రి నేను తపేలా పట్టుకున్నాను. డాక్టరు బాల్చీ పట్టుకున్నాడు. ఇంట్లోపలికి పొర్లివచ్చే కుళ్లు నీటిని తోడిపోస్తున్నాం. ఇంత మేం చేస్తున్నా అత్తయ్య తలకు తెల్లగుడ్డ కట్టుకుని సులక మంచం మీద మూలుగుతోంది. ఆవిడకు భుక్తాయాసం వలన వచ్చిన తలనొప్పిని తగ్గించడానికో, మాకు పని సులువుగా అయిపోవాలనో రమాపతి "అను గట్టిగా అను" అన్నాడు.

"యల్ ఓ వి ఇ........లవ్........"

అతన్ని అనుసరిస్తూ ఎల్.ఓ.వి.ఇ – 'లవ్' తొలిపాఠం వచ్చాక, మలిపాఠం "లవ్ ఈజ్ బ్లైండ్" అని నేర్పాడు.

మా కేకలతో మా పని చురుకుగా సాగిపోతోంది. అత్తయ్య వురిమితే ఆకాశమే వురిమిందనుకున్నాను. రమాపతి పులి అరుపును, పిట్టల కిలకిలగా మార్చి నా చెవిలో గొణిగాడు –

"షి లవ్స్ గోల్డ్" అని.

నాకీ ప్రేమ కలహాలు అప్పుడు అర్థం కాలేదు. అప్పటికి నాకు అర్థం అయింది– అత్తయ్య దగ్గర మామయ్య జడుస్తాడని. మా అత్తయ్య చలికాలం వచ్చి పీడించేవరకూ కన్నవారింటికి కదలలేదు.

"పండగ పోయాక వచ్చేయ్" అన్నాడు.

"ఏం! మీ కిక్కడ కలరా కేసులుంటాయా?" అంది.

ఆవిడ వెళ్లేక యాక్టరు డైలాగు చెప్పినట్లు "అన్ని వేలు కట్నంకాదని మీ అత్తయ్యను ఎందుకు పెళ్లాడా ననుకున్నావ్. నేను రమాపతిని. 'రమ' పేరు వున్నదాన్నే కట్టుకుంటానని భీష్మించాను. దొరికింది మీ అత్తయ్య. ఉండనీ, కన్నవారింట్లో అన్నెల్లు వుండనీ. మనం పంపించిన డబ్బుతో యీ అన్నెల్లూ ఆ ఇల్లంతా బుక్కెడు గంజి తాగుతారు" అన్నాడు.

మామయ్య డాక్టరు డిగ్రీ లేకుండానే డాక్టరు బోర్డు తగిలించుకున్నాడుగానీ, యాక్టరుగా వుంటే సంపాదించి వుండేవాడు మా పల్లెటూర్లో మందుకొట్టినా, సేజి యెక్కి ఒక్క దుశ్శబ్దం లేకుండా పద్యం పాడిన నటుడే జ్ఞాపకం వస్తుండేవాడు. వాడికీ, మా మామయ్యకీ భేదం కనిపించేది కాదు. అత్తయ్య వెళ్ళిపోయి ఆరు

రోజులైనా పొయ్యిలో పుల్లలు వెలిగించటం నేర్పాడు కానీ రొయ్యలు మాత్రం ఇంకా వండలేదు. ఒకసారి నోరు జారేసుకున్నానుకూడా.

"మామూలు రొయ్యలు వండటం నాకు చేతకాదు. గాజు రొయ్యలు బజారులో ఇంకా పడలేదురా" అన్నాడు.

"రోజా చూసివద్దునా?"

"డాక్టర్లు పళ్ళూ, చేపలు, మాంసం కొనకూడదు."

"ఏం?" అన్నాను.

"రోగులు భక్తితో అవి పంపిస్తారు. మనం స్వీకరించాలి" అన్నాడు.

ఎన్నాళ్ళబట్టి యీ తతంగం జరుగుతుందో గానీ, యీనాడు నా కంట పడిపోయింది. అప్పటికి అన్నం వండటం నేర్చుకున్నాను. నా హైస్కూలు పెద్ద దూరం కాదు కాబట్టి మధ్యాహ్నం భోజనానికి వచ్చేవాడిని. ఒకనాడు భోంచేసి వెళ్ళగానే యెవడో చచ్చాడు. స్కూలుకు శలవన్నారు. ఇంట్లో పుస్తకాలుపడేసి యెక్కడికైనా ఆడుకోటానికి పోదామని యింటికివస్తే వీధి అరుగుమీద ఒక కుర్రాడు కూర్చొని వున్నాడు. నా వయసువాడేగానీ అడుక్కునే కుర్రాడనుకున్నాను. మాసినవీ, చిరిగినవీ బట్టలు వేసుకున్నాడు. లోపలికి వెళ్ళబోతుంటే నన్నాపబోయేడు. వాడ్ని తోసుకుని లోపలికి వెళ్ళిపోయాను.

మా రవణమ్మ వురఫ్ రమ అత్తయ్య యే నులక మంచంమీద తలనొప్పని కళ్ళకు గంతలు కట్టి పడుకునేదో ఆ మంచంమీదే ఒక ఆడమనిషి కూర్చొంది. ఆమెను కౌగిట్లో పెట్టుకుని రమాపతి మామయ్య కూర్చున్నాడు. చప్పున లేచిపోయి,

"అప్పుడే వచ్చేసేవేమిరా?" అన్నాడు.

"శలవు" అంటూనే ఆమెవేపు చూసాను. పమిట జారినా సర్దుకోలేదు. డాక్టరు రమాపతి ఆమె పమిట సర్దుతూ.

"నీ జబ్బు నయమైపోతుంది. మరేం ఫర్వాలేద"న్నాడు.

ఏమిటో రోగం అనుకుని నిదానించి చూస్తే మంచం దిగడానికి కాళ్ళతో ఆమె తుడుముకుంటోంది. రెండు కళ్ళూ లేవు. ఆ కుర్రాడు లోనికివచ్చి ఆమెను తీసుకుపోయాడు.

ఆ రాత్రి రొయ్యలకూర, మూడొంతుల కూర నాకే వేశాడు. చివర్లో మరికాస్త కూరవేస్తూ –

"ఈవేళ నివ్వు చూశావే!" అన్నాడు.

"గుడ్డిమనిషా?" అన్నాను.

"మనిషి గుడ్డిదిగాని–మనసు గుడ్డిదికాదు. మంచి మనిషి."

"అత్తయ్యకన్నా మంచిదా?"

"అవును. ఈ మంచి మనిషిని మనం కష్టపడితే మనం నరకానికిపోతాం. మీ అత్తయ్య వస్తుంది."

ఎప్పుడు?

"నివ్వు యివాళ చూసింది చెప్తానంటే రేపే రమ్మని వుత్తరం రాస్తాను."

"చెప్పను–చెప్పను" అనేసాను.

"మీ అత్తయ్య ఇక్కడ ఎంతకాలం లేకపోతే నీకూ మంచిదే. నాకే యిబ్బందిగాని." చేతులు కడుక్కుని నా ముఖంలో చూపుడువేలు ఆడిస్తూ "ఎప్పుడైనా పొరపాటున చెప్పావో నీ పని గోవిందా?" అన్నాడు.

"చెప్పను. నీమీద ఒట్టు, చెప్పను మామయ్యా!" అనేశాను.

ఏన్నాళ్ళు అత్తయ్య రాకపోయినా నాకూ మంచిదే. మగాడైనా మామయ్య బాగా వండుతాడు. అత్తయ్య రెండే గరిటెల నూనె వేసిన కూరకి మామయ్య ఆరు గరిటెలు వేస్తాడు. కంపుకు అత్తయ్య వాసిపోసినట్లుంచేది. రోజా కంపు లేనిది ముద్ద దిగనట్లు మార్చేసాడు మామయ్య. నాకు కొద్దోగొప్పో వంట తెలిసింది. ఒళ్లు పెరిగింది. రోజుకు రోజా నాలో నాకే నూతనంగా కనిపిస్తున్నాను

అలాంటప్పుడు కబురూ కాకరకాయ లేకుండా యిద్దరి కళ్ళలో కారం కొట్టడానికి వచ్చినట్లు అత్తయ్య వచ్చేసింది. వచ్చిన క్షణంనించీ ఇంట్లో ధుమధుమలూ, కూరలో కారం హెచ్చు. చారులో ఉప్పులేదు. యిద్దరం బాగా పెరిగిపోయామని ఆవిడ సగం చచ్చి వచ్చిందని కళ్లు కుట్టిందేమో? పదిసార్లు బజారుకు తిప్పి గోనెపీచు బేరాలు ఆడించేది. ఆ దుకాణం అమ్మ తిట్లు అవిడవి కావుగా – కనీసం వినసైనా వినదుగా!

నుయ్యిదగ్గర అవిడ నీరు తోడుతూ వుంటే అవిడ లంగా వుతుకుతున్న నన్ను ఆపి, ఒక జామకాయ యిచ్చింది.

"తిను."

"తరువాత తింటాను."

"తియ్యగా వుంది తిను," అని నా నోటి దగ్గరగా పెట్టింది.

తింటుంటే –

"నిజం చెప్తావా?" అంది.

మౌనంగా చూసాను.

"మీ మామయ్యకు జడిసి అబద్ధం చెప్తావేమోనని అలా అన్నాను. నీకు వచ్చిన భయం యేమీ లేదు–నిజంచెప్తే నివ్వు ఇక్కడే డాక్టరు చదువు అయ్యేవరకూ వుంటావు" అంది. నేను విషయం అడక్కుండానే యీ ఆశకు నేను లొంగిపోయాననుకుందేమో –

"నేను లేనప్పుడు ఎవరెవరు వచ్చేవారు?" అనడిగింది.

"రోగులు."

"రోగుల్లో ఆడ వాళ్ళెవరూ రాలేదా?"

"మగా ఆడా అంతా మందుకు వచ్చేవారు."

"అంత మందులిస్తే మా నాన్నని ఛార్జీ డబ్బులడుక్కోనిమరీ నేనెందుకు వస్తాను?"

"వచ్చేవారు" అని ముభావంగా తేల్చేసాను.

"అవచ్చింది కర్చుబెట్టి బాగా కక్కాబువ్వా చేసారు. బలిసిపోయి యేం చెయ్యలేదుకదా మీ మామయ్య?"

"ఏమి లేదు."

"ఎక్కడి చుట్టానివి నువ్వు? గతి లేదని బతిమాలితే నివ్వు నాకే ఎసర్లుపెడ్తున్నావు. సూడు మీ నాన్నకి వుత్తరం రాస్తాను. నీ కొడుకుని నివ్వు తీసుకుపో అని"

జామికాయ గబగబ నమిలేసి లంగా వుతుకుతూ "నీరుపోయ్ అత్తా!" అన్నాను.

ఆ లంగా అక్కడ పెట్టు. ఈ వేళనుంచీ నీచేత బట్టలుతికించను. బజారుకు పంపించను. ఇల్లు తుడిపించను, హారికేన్ లైటు నేనే తుడుచుకుంటాను. నీ పని స్కూలు–చదువు అంతే! నువ్వు నిజం చెప్తేనే ఇవన్నీ."

ఆశ పుట్టింది కానీ, భయంతో సంశయిస్తుంటే –

"ఎవరో వచ్చారు కదూ! నా మంచం మీద పడుక్కున్నారు కదూ?"

"పడుకోలేదు" అనేసాను చప్పున.

"కూర్చుందా?"

అవునన్నట్లు తలూపేసాను చప్పున.

"సరే వెళ్లిపో, నేను వుతుక్కుంటానులే" అని పంపించేసింది.

చీకటి పడినా యింటికి రాబుద్ధి పుట్టలేదు. ఇంటికి వెళ్తే మామయ్య యేమంటాడో? ఒళ్ళు సగం చచ్చి విధిలేక ఇంట్లో కాలు పెట్టేను. మామయ్య మందులిస్తున్నాడు. అత్తయ్య తలకు గుడ్డ కట్టుకొని మంచమెక్కింది.

కంఠస్థం చెయ్యించాడేమో యింకా 'షి లవ్స్ గోల్డు' అని మామయ్య అన్న మాటలు జ్ఞప్తికి వున్నాయ్.

అగ్నిపర్వతాలు పేలలేదు. కనీసం ఆకాశంలోనైనా అలజడి లేదు, అన్ని గంటలు కొట్టుకున్న నా గుండె గడగడలతో చిమ్మిన కన్నీళ్ళు యింట్లో పరిస్థితి చూశాక యింకిపోయాయి. ఒక రోజు – రెండు రోజులు. నాకు చదువు తప్పించి యింకోపని లేదు. మామయ్య కోపగించుకోలేదు. అత్తయ్య ఆప్యాయత కుమ్మరిస్తోంది. మూడో రోజున నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. స్కూలు నించి రాగానే అత్తయ్య మెడలో నెక్లెస్ – గోల్డెన్ నెక్లెస్. బంగారం ఆమెకు యెంత హొందా నిచ్చింది? ఎంత హోదాని పెంచింది? మెరుగుపెట్టుకున్న నగ ఆమె అందానికే మెరుగులు దిద్దింది.

అత్తయ్య మామయ్య చిలకాగోరింకల్లా వుండి తీరుబడి లేకపోవడం వల్ల కామోసు నా పాత డ్యూటీలన్నీ నాకే అంటగట్టేసారు. మూడు రోజుల ముచ్చట తేలిపోయింది. ఏది విన్నా, ఏం చూసినా మనసులో యిముడ్చుకోలేని నేను ఒకనాడు –

"అత్తా! అత్తా! యిలాంటి నెక్లేసే నేను మా ఫ్రెండ్ ఇంట్లో వాళ్ళ అక్కమెడలో చూశాను" అన్నాను.

"ఇలాంటి దెక్కడుంటుంది? ఇది స్పెషల్ నెక్లేస్!"

"ఇలాగే పొడులూ ... ఇదే మోడలు" అన్నాను.

"ఏ సినీమాలో... మోడలో చూసి చెయ్యించుకుందో?" అంది.

"అది, గిల్టు నెక్లేస్ అట! బంగారంకాదట."

"ఇంత బరువుంది. ఇది బంగారమే. వెళ్లు వెళ్ళు లైటు తుడు" అని పంపేసింది.

మరుసటిరోజు వుదయమే "ఆ గిల్టు నెక్లెస్ ఒక్కసారి అడిగి తెస్తావా?" అంది.

"అడిగి చూస్తాను" అన్నాను.

"మా అత్తయ్య అలాంటిది కొనుక్కుంటాదట. ఒక్కసారి మోడలు చూడనిస్తారా అని బ్రతిమాలి తీసుకురా బాబూ" అంది.

ఆ వేళ సాయంత్రం నేనూ నా ఫ్రెండూ ఇద్దరం వచ్చాం.

అది చూస్తూ "ఎంతయింది బాబూ?" అంది.

"ఇరవై రూపాయలు. మీది యిలాంటిదే కదా! పాతికైందా?" అన్నాడు.

"నాదా? గిల్టుదికాదే-బంగారం."

"అదీ గిల్టుదే-చూడండి. వెనక కంపెనీ పేరు వుంటుంది" అంటూ రెండూ వాడే చూసి" "యిదిగో! ఒకే కంపెనీ. ఇదీ గిల్టుదే, మీకెవరో మోసం జేసారూ," అంటూ తనది తీసుకొని పోయేడు. నేనూ వాడితో వెళ్ళిపోయాను. చీకటి పడ్డాక ఇంటికి వెళ్లేసరికి యింట్లో మనిషి పోయినట్లు అత్తయ్య ఏడుస్తోంది. మామయ్య బ్రతిమాలితే తోసేసింది. నిజంగా ఆవేళ ఆకాశం బద్దలైనట్లు వాన కురిసింది. మా అత్తయ్య కళ్ళలో నీరూ పారింది! వాళ్లల్లో వాళ్లే తిట్టుకుంటున్నారు. మధ్యను నా పేరు ఆ తిట్లలో వస్తోంది. అది రెండో ప్రపంచయుద్ధ కాలం. బాంబులు విశాఖపట్నంలో త్వరలో పడబోతున్నట్లు నాందీ ప్రస్తావనగా యీ రాత్రి బాంబులు వర్షించాయి నాపైన.

నాలుగు రోజుల్లో మా నాన్న ముఖం స్కూలునించి రాగానే కనిపించింది. అప్పటికప్పుడే నా తిరుగు ప్రయాణం కట్టేసారు. మా నాన్న అంతా విన్నాడు. జవాబు చెప్పలేదు. ఇంటికి వచ్చాక మా అమ్మ యింకెక్కడ చదువుకు పెట్తామని విచారిస్తుంటే -

"అక్కడుంటే వీడికీ ఆ బుద్ధులే అబ్బేవి. మనం అదృష్టవంతులం కాబట్టి మన బాబు మనకు దక్కాడు" అన్నాడు.

నేను అప్పటికే యెదిగిపోయాను. సైకిలుమీద మా వూరికి పదిమైళ్ళ దూరంలో వున్న హైస్కూలుకి ఉదయంవెళ్ళి సాయంత్రం వచ్చేవాడిని.

రోజూ రమాపతి మామయ్య విగ్రహం, ఆ నటన అన్నీ గుర్తుకు వచ్చేవి. అంచేత అతని గురించి తెలుసుకుంటూ వుండాలన్న ధ్యాస నాలో పోలేదు. మా యింటికి అందిన సమాచారంబట్టి యెన్నెన్నో చెడువిషయాలు తెలిసినా ఒక్కవిషయం విని బాధపడ్డాను.

అత్తయ్య ఇంట్లో నూతిలోనే పడి ఆత్మహత్య చేసుకుందట.

దూరం చుట్టమైన మా అమ్మ స్వంత తమ్ముడే పొరపాటు చేసినట్లు తిట్టింది. ఆమెలా మా చుట్టాలెందరో రమాపతి మామయ్యను తిట్టడం విన్నాను. ఇంకో నోటితో యిదికూడా విన్నాను -

"రవణమ్మ ఉత్తమురాలు. వాడే దాన్ని నూతిలో తోసేసి, అదే పడిపోయిందని పుట్టగించేడు."

"అదే పడిపోయివుంటే-ఇంతో అంతో చదువుకున్నదికదా-నాలుగుముక్కలు రాసైనా చచ్చేది."

ఏది ఏమైనా నేను స్కూలు ఫైనలు పేసయి విశాఖపట్నంలో వుద్యోగానికి వచ్చేవరకూ రమాపతి మామయ్యను కలుసుకోలేకపోయాను. మా వూరినించి కదిలేటప్పుడు అమ్మా, నాన్నా యిద్దరూ మరీమరీ చెప్పేరు - రమాపతి గుమ్మంలో మాత్రం కాలు పెట్టకు.

"ఏం?"

"వాడు దొంగ. ఖూనీకోరు. పూర్తిగా పాడైపోయాడు."

ఇలా మా అమ్మా, నాన్నేకాదు - మా చుట్టాలు చాలామంది అన్నారు. ఉద్యోగంలో చేరిన వారం రోజుల్లో ఒక మిత్రుని ఒక సాయంత్రం విడిచిపెట్టడానికి బస్సుస్టాండుకి వెళ్ళను. తిరిగి వెలమపేటనించే వస్తున్నాను. నా పాతయిల్లు ఎదురైంది. ఇంకా అదే బోర్డు "డాక్టరు కె. రమాపతి. ఆర్.ఎమ్.పి" వెలమపేట మారలేదు. ఈ యిల్లూ మారలేదు. ఒక్కటే మార్పు. ఇదివరకున్న హరికేన్ లాంతరు బదులు ఎలక్ట్రిక్ దీపాలు వెలుగుతున్నాయి.

రమాపతి మామయ్య యెవరికో మందు అందిస్తున్నాడు. నన్ను పోల్చుకోలేదు.

"నేను మామయ్యా!" అన్నాను.

"ఒరే నివ్వురా? ఇదే రావటమా? రా కూర్చో" నాకు మాటాడ్డానికి అవకాశం యివ్వకుండా అటు ఆ పేషంటు వేపుకి తిరిగి "మావాడికి గాజు రొయ్యల కూర యిష్టం. వెళ్ళు చప్పైన వందు వెళ్లి చప్పైన ఐదు రూపాయలు తీసుకురమ్మన్నాడు బయటకు తోసాడు. "అల్లుడూ నన్ను గుర్తుపెట్టుకొని వచ్చావు. చాలా సంతోషం. ఇప్పుడెక్కడయేమిటి?" అన్నాడు.

"ఈ వూళ్ళోనే వుద్యోగం."

"సంతోషం."

లోపల పిల్లయేడుపు వినిపించింది.

"ఒక్కనిమిషం" అంటూ లోనికి వెళ్ళి ఉయ్యాల్లో వున్న పిల్లని కామోసు జోలపాడుతూ వూపుతున్నాడు. తిరిగివచ్చి -

"మా పిల్ల మా పెంకిముండ, సాయంత్రం పడుక్కొని రాత్రంతా మేల్కొని వుంటాది," అన్నాడు.

ఇంతలో రొయ్యలొచ్చాయి. ఇంకా అతని వంటకాల రుచి నేను మరచిపోలేదు కాబట్టి యీయనే వండితే ఎంతబాగుణ్ణు అనుకుంటే -

"ఎలా తెచ్చావ్ బాబూ? ఆ నూతి దగ్గర కాస్త బాగుచేసేద్దూ" అన్నాడు.

వాడు లోనికి వెళ్ళాడు. ఐదేళ్ళ అబ్బాయి దగ్గరగావచ్చి -

"నాన్నా, నాన్నా! అమ్మ పిలుస్తోంది" అని అన్నాడు.

"అల్లుడూ, ఇప్పుడే వస్తానుండు" అని లోనికి వెళ్ళాడు. లోనించే "అల్లుడూ అల్లుడూ ఇలారా" అని కేక వినిపించింది. లోపలికి వెళ్లేను. ఆ నులకమంచమే. అదే. అదే దానిమీద ఆవిడ - ఆనాడు నేను మధ్యాన్నం చూసానే ఆ గుడ్డి మనిషే - ఆవిడే.

"అమ్మా, నాన్నా అంతా బాగున్నారా బాబూ?"

"బాగున్నారు."

"ఆయన చుట్టూ అంతా కసితో యీ గుమ్మంలో కాలు పెట్టకపోయినా, అభిమానం వున్నవాడివి వచ్చావు. అదే మాకు నువ్విచ్చిన కొండంత గౌరవం" అంది.

నా నోట మాట రాలేదు. ఈ లోగా రమాపతి మామయ్య కుర్చీ తెచ్చి అక్కడ వేశాడు. వంట తనే చెయ్యాలిమరి. భోజనాలయ్యేక వెళ్ళిపోతానంటే -

"సరే నీ యిష్టం, మళ్ళీ వస్తావా" అన్నాడు.

"ఇంత రాత్రి పంపేస్తున్నారేం? ఈ రాత్రికి యిక్కడ పడుకో నాయనా!" అంది ఆవిడ.

ఎందుకో నేను కాదనలేకపోయాను. ఇద్దరం వరండాలో కూర్చున్నాం. కుళ్ళు కాలువ కంపు యీనాటికీ పోలేదు. కొన్ని ప్రశ్నలు నాలో మెదలుతున్నాయ్. ఈ ప్రశ్నలు నిజానికి నా ఒక్కడివేకావు – లోకానివి.

"అత్తయ్య నూతిలో ఎందుకు పడిపోయినట్లు?" అన్నాను.

"ఇన్నాళ్ళు కాపురం చేసినా నాతోనూ చెప్పలేదు అల్లుడూ! పడిపోయిన ముందు రోజు అంది – గుడ్డిదాన్నయిపోయాను, – నా కళ్ళు నివ్వే పొడిచేసావంది."

"ఆవిడలో చాల ఆశలు, అబద్ధాలతో సృష్టించి వుంటావు" అన్నాను.

జవాబు రాకపోవడంతో మళ్ళీ అన్నాను –

"ఈ వలలో చిక్కుకున్నావు కదా? ఈవిడ ఒక జమీందారు కూతురనీ ఆవిడ బంగారం కుమ్మరిస్తుందని చెప్పివుంటావు– పాపం, నమ్మి వుంటుంది."

"నువ్వే నయం! సూటిగా అడిగేస్తున్నావ్. వెనకాతల గొయ్యిలు తవ్వకుండా!" అన్నాడు.

"అసలు యీ అడుక్కునే గుడ్డి మనిషి నీకెలా దాపరించింది మామయ్యా" అన్నాను.

"రోగం కుదుర్చుకోడానికి డబ్బులేదు. నాలో కాస్త ధర్మగుణం వుందని విందట వచ్చింది. జబ్బు కుదుర్చాను. ఋణం ఎలా తీర్చుకుంటానంది. అవిడకు కళ్ళు గుడ్డి కానీ ఒళ్ళు మెరుస్తోంది కదా– దానిమీద మోజుపడ్డానన్నాను. గాబరాపడినా సర్దుకుంది. డాక్టరు బాబూ, నేను కడుపుకోసం అడుక్కున్నాను. కానీ కక్కుర్తి పడలేదు. ఒకరు నన్ను ముట్టలేదు. నువ్వు ముట్టు–కాదనను. కానీ నివ్వు ముట్టిన తరువాత నన్ను వదిలేసినా– యింకెవర్నీ ముట్టనివ్వనంది. అన్నమాట నిలబెట్టింది. అలాటి మనిషి ముఖం చూడొద్దని మీ అత్త అది మందు పెట్టిందని, ఆవిడ గుడ్డిదని సంకోచించకుండా బయటకు యీడ్చేసింది. నేను ఆరాధిస్తున్న మనిషిని పెంటకుప్పమీద పారేయలేను అల్లుడూ!" అన్నాడు ఆవేశంతో.

ఇంతలో అబ్బాయి "అమ్మ పిలుస్తోంది" అన్నాడు. ఇద్దరంలోనికి వెళ్ళాం.

రమాపతి మామయ్య ఆమె దగ్గరగా వెళ్లాడు. మంచం మెల్లగా దిగి తడుముకుంటూ అతని పాదాలు పట్టుకుని మొక్కి నిద్రపోడానికి మంచం యెక్కింది. ఇద్దరం తిరిగి వచ్చేసాం. ఇది ఆమె నిత్య కర్మ– మా అమ్మ మంగళసూత్రానికి మొక్కి పడుక్కునేది. ఈవిడ భర్త పాధాలు తాకి పడుక్కుంటోంది.

"లోకం అంతా నన్ను దుయ్యబట్టారు. అల్లోడూ! ఇలా దుయ్యబట్టాలనే అది నూతిలో గెంతింది. ఈవిడె గుడ్డిది, కాని ఈవిడ గుండె గుడ్డిదికాదు. ఈ ఒక్క ప్రాణి ఆరాధనే నేను దేముడంత పవిత్రుడ ననుకొని బతకనిస్తోంది అల్లుడూ!" అంటూ రమాపతి మామయ్య కళ్ళ నీరు తుడుచుకున్నాడు.

ఈ సంఘటనతో "ప్రేమ గుడ్డిది కాదను"కుంటూ వెళ్ళిపోయాను.

*(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 28-10-'78)*

* * *